సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 21 । జూలై । 2023



ఓటు వేయడం ఇలా..
ఈవీఎంల అపోహలు తొలగించి అవగాహన కల్పించేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుచేశారు. 8లో



సాగు-బాగుపై కేంద్రబృందం ఆరా
కూసుమంచి వ్యవసాయ డివిజన్‌లో అమలుచేస్తున్న సాగు-బాగు ప్రాజెక్టు పరిశీలనకు కేంద్రబృందం వచ్చింది. 10లో

గరిష్టం / కనిష్టం
30° / 25°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చాలాచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

మొక్కలు, లెక్కలపై అదనపు కలెక్టర్ ఆరా



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అభిలాష

రఘునాథపాలెం: మండలంలోని రేగులచలక, చింతగుర్తి గ్రామపంచాయతీల్లో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హరితహారంలో నాటిన మొక్కలు, అందులో బతికిన వాటి వివరాలు ఆరా తీయడమే కాక పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఆతర్వాత పారిశుద్ధ్య పనులు, పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటికలను తనిఖీ చేశారు. కాగా, పనితీరు ఆధారంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యాన అదనపు కలెక్టర్‌తో పాటు విజిలెన్స్ ఏసీపీ ప్రసన్నకుమార్, ఎఫ్ఆర్ఓ రాధిక తదితరులు వివరాలు ఆరా తీశారు. తనిఖీల్లో ఇన్‌చార్జ్ డీపీఓ అప్పారావు, డీఎల్‌పీఓ పుల్లారావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో తనిఖీ

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వాస్పత్రిని అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలు, ఎంసీహెచ్, బ్లడ్ బ్యాంక్, ఎక్స్‌రే విభాగాల్లో పరిశీలించిన ఆమె వైద్యసేవలపై ఆరా తీశారు. పాత భవనం వర్షానికి కురుస్తుండడంతో గమనించిన ఆమె మరమ్మతులు చేయించాలని సూచించారు. అలాగే, పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి ఎప్పటికప్పుడు చెత్త తరలించాలని ఆదేశించారు. ఆర్ఎంఓలు బి.శ్రీనివాసరావు, అమర్‌సింగ్, రాంబాబుతో పాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల కమిటీలో జిల్లా నేతలు

ఖమ్మంసహకారనగర్: రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ కమిటీని నియమించింది. 26మందితో కూడిన ఈ కమిటీ వివరాలను గురువారం ఏఐసీసీ ప్రకటించింది. కమిటీ చైర్మన్‌గా టీ పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యవహరించనుండగా, మిగిలిన వారు సభ్యులుగా ఉన్నారు. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన నలుగురు సీనియర్ నాయకులకు చోటు కల్పించారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొదెం వీరయ్య, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సభ్యులుగా ఉంటారు.

24వరకు దరఖాస్తు చేసుకోవచ్చు



ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 42మంది గెస్ట్ లెక్చరర్లను నియమించనున్నారు. ఈమేరకు ఆసక్తి, అర్హతలు ఉన్నవారు ఈనెల 24వ తేదీ వరకు www.khammam.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునే వెసలుబాటు కల్పించారు. ఈ విషయాన్ని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు ఒక ప్రకటనలో వెల్లడించారు.

మేలైన యాజమాన్య పద్ధతులతోనే లాభాలు



సదస్సులో పాల్గొన్న డీఏఓ విజయనిర్మల, ఉద్యాన శాఖ అధికారి అనసూయి తదితరులు

నేలకొండపల్లి: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారానే పంటల సాగులో లాభాలు వస్తాయని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల తెలిపారు. నేలకొండపల్లిలో భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన గురువారం రైతు అవగాహన సదస్సు నిర్వహించార. ఈ సదస్సులో డీఏఓ మేలైన యాజమాన్య పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణపై అవగాహన కల్పించడమే కాక రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వివరించారు. ఆతర్వాత వైరా కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ హేమంత్‌కుమార్ తెగుళ్లపై నివారణ చర్యలను వెల్లడించారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి అనుసూయ, సొసైటీ అధ్యక్షుడు పాలడుగు పూర్ణచంద్రప్రసాద్‌తో పాటు యలమద్ది లెనిన్, తెల్లగొర్ల చిన్న లింగస్వామి, వెల్లంపల్లి శ్రీనివాసరావు, గణపతిరావు, రైతులు పాల్గొన్నారు.



బేతుపల్లి చెరువుకు అలుగు పడడంతో ప్రవహిస్తున్న వరద



అలుగు పోస్తున్న సత్తుపల్లి మండలం కాకర్లపల్లి ఊరచెరువు

ముసురేసింది..

జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- చెరువులు, రిజర్వాయర్లలోకి చేరుతున్న నీరు
- వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారుల అప్రమత్తత
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- బచ్చోడులో అత్యధికంగా 4.8 సెం.మీ. వర్షపాతం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: నైరుతి రుతు పవనాల ప్రభావం.. ఉపరితల ద్రోణి నేపథ్యాన జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గత నాలుగు రోజులుగా జిల్లావ్యాప్తంగా ముసురు పట్టగా, గురువారం రోజంతా జల్లులు కురుస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇప్పటికే వేసిన పత్తికి ఈ వర్షాలతో లాభం చేకూరగా.. వరి సాగుకు వర్షాలు అనుకూలంగా మారాయి. అలాగే, చెరువులు, రిజర్వాయర్లలోకి నీరు వచ్చి చేరుతోంది. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై జిల్లాలోని పాఠశాలలకు రెండు రోజుల సెలవు ప్రకటించారు. అలాగే, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

జలాశయాల్లోకి నీరు

జిల్లాలోని చెరువులు, రిజర్వాయర్లు జలకళ సంతరించుకుంటున్నాయి. మొన్నటి వరకు నీరు లేక వెలవెలబోయిన జలాశయాలు ఎడతెరిపి లేని వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో నిండుతున్నాయి. ఖమ్మం రూరల్ మండలం తీర్థాల వద్ద చెక్‌డ్యామ్ మీదుగా మున్నేరు ప్రవహిస్తోంది. పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం 23 అడుగులు కాగా ప్రస్తుతం నీటిమట్టం 19.35 అడుగులకు చేరింది. రిజర్వాయర్‌లోకి 360 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి చెరువు నీటిమట్టం 16 అడుగులు కాగా ఎగువ నుంచి నీరు వచ్చి చేరుతుండటంతో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వైరా రిజర్వాయర్ నీటిమట్టం 18.03 అడుగులు కాగా ప్రస్తుతం 15.2 అడుగులకు చేరింది.

బచ్చోడులో 4.8 సెం.మీ. వర్షం

జిల్లాలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. అయితే బుధవారంతో పోలిస్తే కొంత తక్కువగానే వర్షం ఉంది. జిల్లాలో గురువారం ఉదయం నుంచి రాత్రి 9గంటల వరకు పరిశీలిస్తే అత్యధికంగా తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో 4.8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే, కాకరవాయిలో 3.8 సెంటీమీటర్లు, సింగరేణి మండలం గేట్‌కారేపల్లిలో 2.8, కూసుమంచిలో 2.5, సత్తుపల్లి మండలం గంగారం, కామేపల్లి మండలం లింగాలలో 2.2, సత్తుపల్లిలో 2 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

ఎడతెరిపి లేకుండా..

సోమవారం రాత్రి నుంచి ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. దీంతో పలు లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. వర్షం కారణంగా బుధవారం సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీలో 30 వేల టన్నులు, కిష్టారం ఓసీలో 6 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. ఖమ్మం, మధిర, వైరా, సత్తుపల్లి, పాలేరు నియోజకవర్గాల్లో వర్షం కురుస్తుండటంతో చెరువుల్లోకి నీరు చేరింది. ఈ వర్షాలతో పంటల సాగు ఊపందుకుంటుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే పత్తి, పెసర, వెదజల్లే పద్ధతిలో వేసిన వరికి ఈ వాన ఊపిరిపోయడంతో పాటు ఇంకా సాగు కావాల్సిన వరి, మిర్చి పంటలకు అనుకూలమైన వాతావరణం ఏర్పడింది.

అప్రమత్తమైన అధికారులు



కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌లో ఉద్యోగులు

భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు చేశారు. ఇక అలాగే, కలెక్టరేట్‌లో 90632 11298, 1077 నంబర్లతో కంట్రోల్ రూం ఏర్పాటుచేశారు. జల వనరుల శాఖ, పోలీసు అధికారులు రిజర్వాయర్లు, చెరువులు, లోతట్టు ప్రాంతాలను నిరంతరం పరిశీలిస్తూ ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో రాకపోకలు నిలిపేశారు. ఇక ఖమ్మంలో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి పర్యటించి శిథిలావస్థకు చేరిన భవనాల నుంచి జనాలను ఖాళీ చేయించాలని ఆదేశించారు.

పలువురు సీఐల బదిలీ

ఖమ్మంక్రైం: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఎస్‌ఐబీలో విధులు నిర్వర్తిస్తున్న మోహన్‌బాబును సత్తుపల్లి సీఐగా, వైరా నుంచి ఇటీవల బదిలీ అయిన టి.సురేష్‌కు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో పోస్టింగ్ ఇచ్చారు. అలాగే, సీఐడీలో ఉన్న తిరుపతిరెడ్డిని కారేపల్లి సీఐగా నియమించడంతో పాటు కారేపల్లి సీఐగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఇంకా మధిర నుంచి ఇటీవల బదిలీ అయిన ఓ.మురళిని కొత్తగూడెం త్రీటౌన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

హెడ్ పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం హెడ్ పోస్టాఫీస్‌లో గురువారం ఆధార్ సేవలు ప్రారంభమయ్యాయి. ఇక్కడ నూతన ఆధార్‌కార్డుల జారీతో పాటు చిరునామా మార్పులు, తప్పుల సవరణ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ మాట్లాడుతూ ఇప్పటికే గాంధీచౌక్, జిల్లా పరిషత్ కార్యాలయంలోని తపాలా కార్యాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉండగా, హెడ్‌పోస్టాఫీస్‌లో కూడా ప్రారంభించామని తెలిపారు. ఖమ్మం ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పాలన సంతృప్తినిచ్చింది..

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు చేర్చడమే లక్ష్యం
- రాత్రింబవళ్లు శ్రమించి ధరణి సమస్యలు పరిష్కరించాం
- రెండేళ్ల పదవీకాలంపై కలెక్టర్ గౌతమ్



ఓటు అవగాహన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: అన్ని రంగాల్లో చైతన్యవంతమైన ఖమ్మం జిల్లాలో పాలన ఎంతగానో తృప్తినిచ్చిందని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించిన గురువారంతో రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. విధినిర్వహణలో సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందజేయాలనే లక్ష్యంతోనే పనిచేశానే తప్ప ర్యాంకుల కోసం పోటీ పడలేదని చెప్పారు. ధరణి ద్వారా ఎదురైన సమస్యలపై పలుమార్లు తహసీల్దార్లు, అధికారులతో చర్చించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కారం లభించిందని తెలిపారు. కాగా, జీఓ 58 ద్వారా 3,500 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని, మిగతా వారి దరఖాస్తుల పరిశీలన జరుగుతోందని వివరించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను 2వేలకు పైగా లబ్ధిదారులకు ఇవ్వగా, నిర్మాణాలు, ఎంపికలో రాష్ట్రంలో ఖమ్మం ముందు నిలిచిందని గౌతమ్ తెలిపారు.

దళితబంధుతో లబ్ధి

దళితబంధు పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన చింతకాని మండలంలోని లబ్ధిదారులు మెరుగైన యూనిట్లు ఎంపిక చేసుకునేందుకు సహకరించడం తృప్తినిచ్చిందని కలెక్టర్ చెప్పారు. అలాగే, మన ఊరు - మన బడి పనుల్లో వేగం పెంచడమే కాక విద్యార్థులకు పాఠశాలల్లోనే సర్టిఫికెట్లు జారీ చేశామని తెలిపారు. కాగా, రఘునాథపాలెం వద్ద మినీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు జరుగుతున్నాయని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు పెరుగుతున్న నేపథ్యాన గుబ్బగుర్తి, కల్లూరుగూడెంలలో ఫ్యాక్టరీల ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

ఓటింగ్‌పై విస్తృత ప్రచారం

ఈవీఎంలు, వీవీ ప్యాట్ల వినియోగంపై విస్తృత ప్రచారం చేయనున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన అవగాహన కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఓటు హక్కు వినియోగించుకోవడాన్ని ప్రజలు బాధ్యతగా గుర్తించడంతో పాటు అపోహలు తొలగించేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్, జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, ఏఓ అరుణ, సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే

- జిల్లాలో ఉన్నదంతా ఒకటే వర్గం
- టీ పీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



డీసీసీ కార్యాలయంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, పక్కన దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు, తదితరులు

ఖమ్మం సహకారనగర్/కూసుమంచి: రానున్న ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో విజయం సాధించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకరావడమే అందరి లక్ష్యమని, ఇందుకోసం నాలుగు మెట్లు దిగి పనిచేయడానికైనా సిద్ధంగా ఉన్నానని ఖమ్మం మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కోచైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి గురువారం జిల్లాకు వచ్చిన ఆయనకు కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి మార్గమధ్యలో అంబేడ్కర్, రాజీవ్ గాంధీ, వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు తదితరులు ఆయనకు స్వాగతం పలికి సన్మానించాక పొంగులేటి మాట్లాడారు. ఉమ్మడి జిల్లా పార్టీలో వర్గాలు లేవని, ఉన్నదంతా కాంగ్రెస్ వర్గమేనని తెలిపారు. ప్రజలకు మాయమాటలు చెప్పి రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపటమే అందరి లక్ష్యమన్నారు. ఇందుకోసం జిల్లాలోని సీనియర్ నాయకులతో పాటు ప్రతీ నాయకుడు, కార్యకర్త, అభిమానిని కలుపుకుపోతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నగర అధ్యక్షులు మహ్మద్ జావేద్‌తో పాటు కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు మద్దినేని బేబి స్వర్ణకుమారి, తుళ్లూరి బ్రహ్మయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, నాగండ్ల దీపక్‌చౌదరి, రాయల నాగేశ్వరావు, పుచ్చకాయల వీరభద్రం, మాలోత్ రాందాస్‌నాయక్, శీలం ప్రతాప్‌రెడ్డి, యడ్లపల్లి సంతోష్, దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, మొక్కా శేఖర్‌గౌడ్, వక్కలగడ్డ సోమచంద్రశేఖర్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, వడ్డెబోయిన నరసింహారావు, సైదేశ్వర్‌రావు, యర్రం బాలగంగాధర్ తిలక్, పాలకుర్తి నాగేశ్వరావు, తాళ్లూరి హన్మంతరావు, బానోతు విజయబాబు, జారె ఆదినారాయణ, ఊకంటి గోపాలరావు, డాక్టర్ కోటా రాంబాబు, కొండూరు సుధాకర్, చావా శివరామకృష్ణ, దొడ్డా నగేష్‌యాదవ్, మలీదు జగన్, గోసు మధు తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచిలో జీపీ కార్మికుల వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న పొంగులేటి

సన్మానించిన సత్తుపల్లి నేతలు

ఖమ్మంమయూరిసెంటర్: టీ పీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్‌గా నియమితులై తొలిసారి ఖమ్మం వచ్చిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సత్తుపల్లి నియోజకవర్గ నాయకులు సన్మానించారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ఆయనను సన్మానించిన వారిలో మట్టా దయానంద్, తదితరులు ఉన్నారు.

'ప్రమాద' స్థాయిలో..

భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి
- 43 అడుగులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- సహాయక చర్యల పర్యవేక్షణకు నేడు మంత్రి పువ్వాడ రాక



భద్రాచలంలో గోదావరి ఉధృతి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/భద్రాచలం: తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద పోటెత్తుతోంది. దీంతో భద్రాచలం వద్ద గురువారం మధ్యాహ్నం నీటి మట్టం 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కలెక్టర్ ఎ.ప్రియాంక సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

పొంగి పొర్లుతున్న ఉపనదులు

ఉప నదులైన ప్రాణహిత, ఇంద్రావతి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద పెరుగుతోంది. మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీ నుంచి బుధవారం 5.20లక్షల క్యూసెక్కులు, గురువారం మధ్యాహ్నం 6.20లక్షల క్యూసెక్కుల గరిష్ట వరదను దిగువకు వదిలారు. దీనికి ఇంద్రావతి నుంచి వస్తున్న సుమారు నాలుగు లక్షల క్యూసెక్కుల జల ప్రవాహం జతవుతోంది. దీంతో భద్రాచలం వద్ద నీటిమట్టం గంటగంటకూ పెరుగుతోంది. గురువారం అర్ధరాత్రి లేదా శుక్రవారం తెల్లవారుజాము వరకు రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి అయిన 48 అడుగులకు, ప్రవాహం కొనసాగితే సాయంత్రానికి 53 అడుగులకు చేరి మూడో ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేసే అవకాశం ఉంది.

అప్రమత్తంగా ఉంటేనే నష్ట నివారణ

గోదావరి నీటిమట్టం గతేడాది అత్యధికంగా 71.3 అడుగులకు చేరి బీభత్సం సృష్టించడంతో.. అధికారులు ఈ ఏడాది ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. జూలై ప్రారంభంలోనే అధికారులకు దిశానిర్దేశం చేశారు. మూడో ప్రమాద హెచ్చరిక దాటితే ఏజెన్సీలోని పలు గ్రామాలు ముంపునకు గురై, భద్రాచలం నుంచి మండలాలకు రాకపోకలు స్తంభించే అవకాశం ఉండడంతో ముందు జాగ్రత్త చర్యల్లో నిమగ్నమయ్యారు. అలాగే, వరద తీవ్రత పెరిగితే బాధితులను తరలించేందుకు పునరావాస కేంద్రాలు సిద్ధం చేశారు. మండలానికో ప్రత్యేక అధికారికి బాధ్యతలు అప్పగించి కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. నిత్యావసర సరుకులను సిద్ధం చేయడమే కాక ప్రజలను తరలించేందుకు వాహనాలు, పడవలు సమకూర్చుకున్నారు.

నేడు మంత్రి పువ్వాడ రాక

గోదావరికి వరద పెరుగుతుండడంతో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సహాయక చర్యల పర్యవేక్షణకు శుక్రవారం భద్రాచలం వస్తున్నారు. అలాగే, గత ఏడాది సహాయక చర్యల్లో పాలు పంచుకుని ఇటీవల బదిలీపై వెళ్లిన కలెక్టర్ అనుదీప్, ఐటీడీఏ పీఓ గౌతమ్ సైతం రానున్నారు.

ఎరక్కపోయి వచ్చి..

- కుక్కలు వెంబడించడంతో బావిలో పడిన దుప్పి
- రక్షించిన అటవీ ఉద్యోగులు



దుప్పిని పైకి తీసుకొస్తున్న అటవీశాఖ సిబ్బంది (ఇన్‌సెట్) బావిలో పడిపోయిన దుప్పి



జీపులో తీసుకెళ్తున్న ఉద్యోగులు

అడవిలో ఉండాల్సిన చుక్కల దుప్పి ఒకటి గురువారం మధ్యాహ్న సమయంలో మండలంలోని పిండిప్రోలు శివాలయం సమీపానికి వచ్చింది. ఇంతలోనే కుక్కలు వెంబడించడంతో పరుగెత్తుతూ వ్యవసాయబావిలో పడింది. ఈ విషయాన్ని గమనించిన రైతులు కూసుమంచి ఎఫ్ఆర్ఓ పి.శ్రీనివాసరావుకు సమాచారం ఇవ్వగా ఆయనతో పాటు రేంజర్ సురేష్‌కుమార్, సిబ్బంది చేరుకున్నారు. తాళ్లసాయంతో బావిలోకి దిగి దుప్పిని బయటకు తీసుకొచ్చి వెటర్నరీ వైద్యులతో పరీక్ష చేయించారు. దుప్పికి ఎలాంటి గాయాలు కాలేదని, ఆరోగ్యంగా ఉందని చెప్పడంతో జూ పార్క్‌లో వదిలేందుకు గాను ఉద్యోగులు జీపులో తీసుకెళ్లారు. కాగా, చుక్కల దుప్పి వయస్సు సుమారు మూడేళ్లు ఉంటుందని, ఇక్కడకు ఎలా వచ్చిందో తెలియదని స్థానికులు చెబుతున్నారు.

– తిరుమలాయపాలెం

క్లుప్తంగా

జాబ్‌మేళాకు 85 మంది హాజరు

ఖమ్మం స్పోర్ట్స్: టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జిల్లా ఉపాధి కల్పనశాఖ ఆధ్వర్యాన ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించేందుకు గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈసందర్భంగా హాజరైన 85 మంది అభ్యర్థుల్లో 35 మంది ఎంపికయ్యారని జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరాం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయం ముట్టడి



డీపీఓతో వాగ్వాదానికి దిగిన నాయకులు

రఘునాథపాలెం: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిల పక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీపీ కార్మికుల సమ్మెలో భాగంగా గురువారం సీపీఐ, సీపీఎం, ప్రజాపంథా, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యాన రఘునాథపాలెం ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. అప్పటికే కార్యాలయం గేట్లు వేయడంతో కార్మికులు, నాయకులు గేటు దూకి లోనకు వెళ్లారు. ఈక్రమంలో పోలీసులు అడ్డుకోగా ఉద్రిక్తత నెలకొంది. అనంతరం అక్కడకు వచ్చిన ఇన్‌చార్జ్ డీపీఓ అప్పారావుతో వాగ్వాదానికి దిగారు. తాము సమ్మె చేస్తుండగా తాత్కాలిక కార్మికులతో పని చేయించడం సరికాదని, ఇకనైనా తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు పగడాల మల్లేష్, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, మందా వెంకటేశ్వర్లు, తుమ్మా విష్ణువర్ధన్ శిరోమణి, ఝాన్సీ, పిట్టల మల్లయ్య, రాందాస్, నారాయణ, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

29న ఖమ్మంకు అమిత్‌షా



ప్రధాని మోదీతో సుధాకర్‌రెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలో ఈనెల 29న జరిగే సభకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హాజరవుతారని బీజేపీ తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. ఈమేరకు గురువారం ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీతో పాటు అమిత్ షాను ఆయన కలిశారు. ఈసందర్భంగా ఖమ్మం పర్యటనతో పాటు ఇతర అంశాలపై చర్చించినట్లు సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నేలకొండపల్లి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని గువ్వలగూడెం వద్ద స్కార్పియో వాహనంలో బియ్యం ఉన్నట్లు స్థానికులు గురువారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో తనిఖీలు చేపట్టి పది క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఖమ్మం పీజీ కళాశాల నుంచి ప్రొఫెసర్ల బదిలీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ ఆచార్య కట్ల రాజేందర్‌ను కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్ కళాశాలకు బదిలీ చేశారు. ఈమేరకు రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేయగా ఆయన గురువారం విధుల్లో చేరారు. అలాగే, హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల సోషియాలజీ విభాగాధిపతిగా విధులు నిర్వర్తిస్తూనే ఖమ్మం పీజీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆచార్య కుంట అయిలయ్యను కూడా కేయూ పరిధిలోని ఆర్ట్స్ కళాశాల సోషియాలజీ విభాగానికి బదిలీ చేశారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా రవికుమార్

కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, కాంట్రాక్టు లెక్చరర్ డాక్టర్ రవికుమార్‌కు ఖమ్మం పీజీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలతో నియమించారు. ఈ విషయమై కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఖమ్మం పీజీ కళాశాలలో ఉన్న ఇద్దరు రెగ్యులర్ ఆచార్యులను బదిలీ చేయడంతో రెగ్యులర్ ఆచార్యులెవరూ లేకుండా పోయారు.

కేయూ పరిధిలో పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో గురువారం, శుక్రవారం జరగాల్సిన పలు పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి తెలిపారు. ఫార్మా డీ మూడు, ఐదేళ్ల కోర్సులు, బీఫార్మసీ ఏడు, ఎనిమిదో సెమిస్టర్లు, బీటెక్ సీబీసీఎస్ నాలుగు, ఆరో సెమిస్టర్లు, బీటెక్ (నాన్ సీబీసీఎస్) నాలుగు, ఆరు, ఐదు, మూడో సెమిస్టర్ల పరీక్షలు వాయిదా వేసినట్లు వెల్లడించారు. వర్షాల కారణంగా వాయిదా వేసిన ఈ పరీక్షలను మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే వెల్లడిస్తామని, మిగతా పరీక్షలు టైంటేబుల్ ప్రకారం జరుగుతాయని తెలిపారు.



ఖమ్మం రూరల్ మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరు నది



నేలకొండపల్లి : నిండు కుండలా చెరువుమాధారం చెరువు



సత్తుపల్లి రూరల్ : కాకర్లపల్లి ఊర చెరువు కాల్వలో చేపలు పడుతున్న స్థానికులు

నిండుకుండల్లా జలాశయాలు

- ఎడతెరిపి లేని వానలతో చేరుతున్న నీరు
- అలుగు పారుతున్న చెరువులు, చెక్‌డ్యాంలు

ఖమ్మంఅర్బన్: వారం క్రితం వరకు నీరు లేకపోయిన జిల్లాలోని చెరువులు, జలాశయాలకు మళ్లీ జలకళ వచ్చింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నీరు చేరుతుండడంతో అలుగు పోస్తున్నాయి. గురువారం సాయంత్రానికి అధికారిక సమాచారం మేరకు జిల్లాలోని 983 చెరువులకు గాను మూడు చెరువులు అలుగులు పారుతున్నాయి. అలాగే, 58 చెరువులు వంద శాతం నిండగా, 117 చెరువుల్లోకి 75నుండి 100 శాతం మేర నీరు చేరింది. మరో రెండు, మూడు రోజులు వర్షాలు ఇలాగే ఉంటే అత్యధిక శాతం చెరువులు అలుగులు పారే అవకాశముందని చెబుతున్నారు. కాగా, జిల్లాలోని పలు చెరువులను జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్, ఉద్యోగులు పరిశీలించి లీకేజీలపై ఇంజనీర్లకు సూచనలు చేశారు.



ఖమ్మం రూరల్ మండలం తీర్థాల వద్ద చెక్‌డ్యామ్ మీదుగా ప్రవహిస్తున్న మున్నేరు

● సత్తుపల్లి: మండలంలోని బేతుపల్లి పెద్ద చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం 16 అడుగులకు చేరటంతో అలుగు పోస్తోంది. దీంతో గురువారం 450 క్యూసెక్కుల నీటిని ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈఈ మరియన్న దిగువకు విడుదల చేశారు. బేతుపల్లి ప్రత్యామ్నాయ కాల్వ ద్వారా వేంసూరు మండలంలోని 46 చెరువులకు ఈ నీరు చేరుతోంది. ఈ కార్యక్రమంలో ఏఈ వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ ప్రసాద్ పాల్గొన్నారు. ఇంకా కిష్టారం–చెరుకుపల్లి రహదారిలో ఊట వాగు పొంగటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.

● వైరా: వైరా రిజర్వాయర్ నీటి మట్టం గురువారం 15.9 అడుగులకు చేరింది. స్థానికంగా వర్షాలు కురుస్తుండడంతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో రిజర్వాయర్ నీటి మట్టం వేగంగా పెరుగుతోంది.



వైరా రిజర్వాయర్ వద్ద వరదను పరిశీలిస్తున్న సీఈ శంకర్‌నాయక్


● కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం గురువారానికి 19.35 అడుగులకు చేరింది. రిజర్వాయర్‌కు ఇటీవల సాగర్ జలాలు విడుదల చేయగా బుధవారం నిలిపివేశారు. ఈక్రమంలో23 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టానికి గానూ 19.35 అడుగులకు చేరింది. తాజాగా వర్షాలతో రిజర్వాయర్‌కు 360 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా, ఈ ప్రవాహం పెరిగితే నీటిమట్టం గరిష్టస్థాయికి చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం రిజర్వాయర్ నుండి 125.60 క్యూసెక్కుల నీరు తాగునీటి పథకాలకు విడుదల చేస్తున్నారు.

● నేలకొండపల్లి: భారీ వర్షాలతో మండలంలోని చెరువుమాధారం చెరువుకు భారీగా వరద చేరుతోంది. దీంతో చెరువు నిండుకుండలా మారింది. అలాగే, నేలకొండపల్లిలోని బాలసముద్రం చెరువులోకి కూడా వరద వస్తోంది.

● సత్తుపల్లిరూరల్: వరుస వర్షాలతో మండలంలోని కాకర్లపల్లి ఊర చెరువు అలుగు పారుతోంది. అలాగే, తుంబూరు, తమ్మిలేరు వాగుల్లో నీరు ప్రవహిస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఉత్సాహంగా చేపలు పట్టడం కనిపించింది.



సత్తుపల్లి : బేతుపల్లి పెద్దచెరువు నుంచి నీరు విడుదల చేస్తున్న ఇరిగేషన్ అధికారులు



వైరా : రిజర్వాయర్‌లో చేరిన వరద నీరు



కూసుమంచి : కళకళలాడుతున్న పాలేరు రిజర్వాయర్

స్పోర్ట్స్ స్కూల్ రాష్ట్ర స్థాయి పోటీలకు 39 మంది ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రంలోని స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఇటీవల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈమేరకు 4, 5వ తరగతి విద్యార్థులు బ్యాటరీ టెస్టుకు హాజరుకాగా, వీరిలో అత్యధిక పాయింట్లు సాధించిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల వివరాలను గురువారం డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి వెల్లడించారు. 4వ తరగతి బాలుర నుంచి ఆర్.వేణు, ఆర్.వేమన్, వై.యోజిత్, ఎస్.లక్ష్మణ్, ఎ.సాయితేజ, కె.విఘ్నేష్, పి.హర్ష, జి.కుషాల్, యు.అక్షిత్, బి.గౌతమ్, బాలికల విభాగంలో పి.దీక్షితగౌరి, కె.పృధ్విని, సి.రోనిత, పి.కావ్యశ్రీ, పి.మోక్షిత, పి.వెన్నెల, వి.జస్మిత, సీహెచ్.నందిని, కె.కారుణ్యశ్రీ, ఈ.దివ్యశ్రీ ఎంపికయ్యారు. అలాగే, 5వ తరగతి బాలురలో బి.శివరాం, డి.మనోహర్ కుమార్, ఎస్.మనోహర్, కె.జగత్, కె.మోక్షిత్, డి.శరత్ చంద్ర, బి.సిద్ధార్థ, ఎస్.కే.యాకూబ్ పాషా, జి.నిరీక్షణ్, బాలికల విభాగంలో జె.నమ్రత, బి.సైను, జి.దీక్షితశ్రీ, బి.శారద, డి.గంగా శ్రీవేణి, బి.ఆనందిని, డి.నాగేశ్వరి, బి.సింధు, పి.ప్రతిభ, ఎం.ఉమామహేశ్వరి ఎంపికయ్యారని డీవైఎస్‌ఓ తెలిపారు. వీరు సికింద్రాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొననున్నారు.

నేను దేవుడిని.. గుడి కట్టించండి!

బాలుడి పూనకంతో నేలకొండపల్లిలో ఉద్రిక్తత

నేలకొండపల్లి: నేను దేవుడిని... నాకు గుడి కట్టించండి... రోడ్డు వెంట దిమ్మె కింద వెలిశాను అంటూ ఓ బాలుడు పూనకంతో చెప్పడం, ఆయన ఓ పార్టీకి చెందిన దిమ్మెను అర్ధరాత్రి పగలగొట్టేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకోవడంతో నేలకొండపల్లిలో ఉద్రిక్తత నెలకొంది. వివరాలు... మండల కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన బాలుడు బుధవారం అర్ధరాత్రి పూనకంతో ఊగిపోతూ ఓ పార్టీ నిర్మించిన దిమ్మె కింద వెలిసినందున గుడి కట్టాలని చెప్పాడు. దీంతో కుటుంబీకులు దిమ్మె పగలగొట్టి పసుపు, కుంకుమ చల్లుతుండగా స్థానికులు అడ్డగించారు. ఇలా గొడవ పెరగడంతో బాలుడి కుటుంబం ఇంట్లోకి వెళ్లిపోయింది. ఈమేరకు గురువారం ఉదయం గ్రామపెద్దలు, స్థానికులు కలిసి వారిని నిలదీయగా వివాదం ముదురుతుండడంతో పోలీసులు చేరుకుని ఇరువర్గాలకు చెదరగొట్టారు.

నిరంతర విద్యుత్ ఘనత కేసీఆర్‌దే..

జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

ముదిగొండ/చింతకాని: రాష్ట్రంలో కోతలు లేకుండా రైతులకు నిరంతరం విద్యుత్ అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు తెలిపారు. ముదిగొండలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుబంధు, రైతు బీమా, 24గంటలు ఉచిత విద్యుత్‌తో పాటు ప్రాజెక్టుల నిర్మాణంతో వ్యవసాయాన్ని కేసీఆర్ పండుగలా మార్చాలని తెలిపారు. కాగా, వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని చెబుతున్న కాంగ్రెస్ నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. అనంతరం 16మందికి రూ.5.91లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. అలాగే, చింతకాని మండలంలోని పది మందికి మంజూరైన రూ.3.80లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఖమ్మం జెడ్పీ కార్యాలయంలో కమల్‌రాజ్ అందజేశారు. ఈకార్యక్రమాల్లో ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జెడ్పీటీసీలు పసుపులేటి దుర్గ, పర్చగాని తిరుపతి కిషోర్, సర్పంచ్‌లు మందరపు లక్ష్మి, చాట్ల సురేష్‌తో పాటు పోట్ల ప్రసాద్, ఎర్ర వెంకన్న, మీగడ శ్రీనివాస్, నీరజకుమారి, వెంకట్, గురిజాల హన్మంతరావు, మంకెన రమేష్, పెంట్యాల పుల్లయ్య, బొడ్డు వెంకటరామయ్య, గడ్డం శ్రీను, బొగ్గారపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ముదిగొండ : మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజు

కలెక్టర్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్

ఖమ్మం సహకారనగర్: కలెక్టర్‌గా గౌతమ్ బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ సన్మానించారు. ఖమ్మంలోని కలెక్టరేట్‌లో ఆయనను కలిసి జెడ్పీ చైర్మన్ సన్మానించాక పలు అంశాలపై చర్చించారు.

సీపీఎం కార్యకర్త కుటుంబానికి రూ.10లక్షల ఆర్థికసాయం

తిరుమలాయపాలెం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీపీఎం కార్యకర్త బట్టి రాజేష్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు గురువారం నివాళులర్పించారు. తిరుమలాయపాలెం మండలం సుబ్లేడుకు చెందిన రాజేష్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు కారు డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తుండగా, రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఈమేరకు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించిన వీరభద్రం, తదితరులు పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటీల ఆధ్వర్యాన రూ.10లక్షల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్య, బుగ్గవీటి సరళ, భారతి, సత్యనారాయణ, బండి రమేష్, పద్మ, బషీరుద్దీన్, శ్రీను, నవీన్, సుదర్శన్‌రెడ్డి, వీరన్న, సురేష్, ఎస్.డీ.జియావుద్దీన్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న తమ్మినేని వీరభద్రం

ఓటు వేయడం ఇలా...

ఈవీఎంల పనితీరుపై అవగాహన సదస్సులు

ఖమ్మంమయూరిసెంటర్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నవేళ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈమేరకు ఈవీఎంలపై అపోహలు తొలగించడంతో పాటు ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా గురువారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటుచేసి వీవీ ప్యాట్, ఈవీఎం ప్రదర్శించగా కమిషనర్ ఆదర్శ్‌సురభి మాట్లాడారు. ఓటు వేయాల్సిన విధానం, ఓటు పడిందా అనే విషయం వీ వీ ప్యాట్ ద్వారా తెలుసుకునే అంశంపై సెప్టెంబర్ 20 వరకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

అవగాహన కల్పించండి

వైరా/కొణిజర్ల: ఓటర్లకు ఈవీఎం, వీవీ ప్యాట్లపై అవగాహన కల్పించి అందరూ పోలింగ్‌లో పాల్గొనేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, ఎన్.మధుసూదన్ సూచించారు. వైరా తహసీల్‌లో ఏర్పాటుచేసిన మోడల్ ఈవీఎం లను వారు పరిశీలించి అవగాహన కల్పించడంపై ఉద్యోగులతో చర్చించారు. తహసీల్దార్ వి.జగదీశ్వరప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే, కొణిజరల జెడ్పీహెచ్‌ఎస్‌లో బీఎల్‌ఓలకు ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరంలో అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, మధుసూదన్ మాట్లాడుతూ బూత్ లెవల్‌లో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, అనర్హుల తొలగింపుపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ ఆర్.రమాదేవి, తహసీల్దార్ డి.సైదులు, హెచ్‌ఎం డి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం మయూరిసెంటర్: ఈవీఎం పనితీరును వివరిస్తున్న కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి



వైరా : ఈవీఎంలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్లు అభిలాష, మధుసూదన్

దంపతులపై అట్రాసిటీ కేసు నమోదు

నేలకొండపల్లి: మండలంలోని సుర్దేపల్లికి చెందిన భార్యాభర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదైంది. సుర్దేపల్లికి చెందిన గోవింద్, ఆయన భార్య కళ్యాణి ఇటీవల దళితులకు చెందిన శ్మశానవాటిక హద్దులు చెరిపి స్తంభాలను ధ్వంసం చేశారు. దీనిని అడ్డుకున్న దళితులను కులం పేరుతో దూషించగా, తోళ్ల వీరబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ నిర్వహించాక ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.స్రవంతి తెలిపారు.

ప్రేమ పెళ్లి చేసుకున్న యువకుడి ఇంటిపై దాడి

చింతకాని: ప్రేమవివాహం చేసుకోవడంతో యువతి బంధువులు యువకుడి ఇంటిపై దాడి చేయగా నలుగురిపై పోలీసులు నమోదుచేశారు. మండలంలోని నాగులవంచకు చెందిన మందా సంపత్ మత్కేపల్లికి చెందిన యువతిని ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ పెళ్లి యువతి తల్లిదండ్రులకు ఇష్టం లేకపోవటంతో ఆమె కుటుంబీకులైన కృష్ణారావు, ఉమారాణి, వెంకటేష్, మహాలక్ష్మి కలిసి యువకుడి ఇంటికి వెళ్లి అసభ్య పదజాలంతో దూషిస్తూ ఆయన నానమ్మ ఆదెమ్మపై దాడి చేశారు. ఘటనపై యువకుడి తండ్రి గోవిందు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాదిల వెంకన్న తెలిపారు.

ఇంటర్‌లో చేరాలన్నందుకు ఆత్మహత్య

ఏన్కూరు: ఇంటర్‌లో చేరాలని తల్లిదండ్రులు మందలించడంతో పురుగుల మందు తాగిన విద్యార్థి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రఘునాథపాలెం మండలం మూలగూడెం గ్రామానికి చెందిన బానోతు శివాజీ(18) 2022లో పదో తరగతి పూర్తిచేయగా, ఇంటర్‌లో చేరాలని తల్లిదండ్రులు సూచించినా ఏడాది మొత్తం ఖాళీగానే ఉన్నాడు. ఈనెల 18న మళ్లీ తల్లిదండ్రులు కళాశాలలో చేరాలని చెప్పడంతో శివాజీ ఏన్కూరు మండలం రాజలింగాల వచ్చి పురుగుల మందు తాగాక తన బంధువులకు ఫోన్ చేశాడు. దీంతో తండ్రి కృష్ణ, బంధువులు వచ్చి ఆయనను ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈమేరకు మృతుడి తండ్రి కృష్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఆనందరావు తెలిపారు.

గుండెపోటుతో నిరుద్యోగి మృతి

ఖమ్మం లైబ్రరీలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విజయవాడ వాసి



దుర్గారావు (ఫైల్)

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని కేంద్ర గ్రంథాలయంలో ఓ నిరుద్యోగి గురువారం గుండెపోటుతో మృతి చెందారు. గ్రంథాలయ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ ఎస్‌ఎస్‌సీ.బోస్ నగర్‌కు చెందిన తంగెళ్లమూడి దుర్గారావు(40) కొద్ది రోజులుగా గ్రంథాలయానికి వస్తున్నారు. ఖమ్మంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు, సంస్థల్లో ఉద్యోగం కోసం యత్నిస్తున్న ఆయన గురువారం ఉదయం వచ్చి మంచినీళ్లు తాగుతూ కుప్పకూలాడు. దీంతో ఫిట్స్‌గా భావించిన గ్రంథాలయ సిబ్బంది 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, మార్గమధ్యలోనే దుర్గారావు మరణించినట్లు వైద్యులు తెలిపారు. కాషాయం లుంగీ, ఓ సంచితో నిత్యం దుర్గారావు లైబ్రరీకి వచ్చేవాడని చెప్పిన ఉద్యోగులు... ఆయన వద్ద ఫోన్‌లోని నంబర్లకు ఫోన్ చేస్తే సరైన సమాధానం లేదని చెప్పారు. కాగా, దుర్గారావు మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చగా ఖమ్మం టూటౌన్ పోలీసులు వివరాల కోసం యత్నిస్తున్నారు.

తప్పిపోయిన వ్యక్తి పట్టాలపై శవమై...

కల్లూరు: కల్లూరు మండలం వెన్నవల్లికి చెందిన పాన్నూరు నాగేశ్వరరావు(33) పది రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోగా, విజయవాడలో రైల్వే ట్రాక్‌పై మృతి చెందినట్లు గుర్తించారు. వెన్నవల్లికి చెందిన నాగేశ్వరరావు కనిపించడం లేదని ఆయన తండ్రి వెంకటేశ్వరరావు పది రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు విజయవాడ రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌పై గురువారం లభ్యమైన మృతదేహం వద్ద ఆధార్ కార్డులోని వివరాల ప్రకారం నాగేశ్వరరావుగా గుర్తించి కుటుంబీకులు, కల్లూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా, ఆయన భార్య ఉమ, ఏడాది కుమారుడు ఉండగా, మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు కుటుంబీకులు విజయవాడ వెళ్లారు. నాగేశ్వరరావు రైలు ఎక్కుతుండగానో, దిగుతూనే ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటాడని సమాచారం.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో చోరీ జరిగింది. ఇందిరానగర్‌లో నివసిస్తున్న మాధవరావు కుమార్తెకు హైదరాబాద్‌లో ఉద్యోగం రావడంతో అందరూ కలిసి నాలుగు రోజుల క్రితం వెళ్లారు. తిరిగి గురువారం సాయంత్రం వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో పరిశీలించగా పది తులాల బంగారం, కిలో వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈమేరకు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా క్లూస్ టీంతో చేరుకుని పరిశీలించారు. కాగా, ఇంటి ఆవరణలోని సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా అనుమానితులను గుర్తించి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

మూసీ స్కైవే ప్రతిపాదన రాలేదు

పార్లమెంట్‌లో స్పష్టం చేసిన కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్



సాక్షి, న్యూఢిల్లీ: మూసీ నదిపై స్కైవే నిర్మాణానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రం ఎటువంటి ప్రతిపాదనను అందుకోలేదని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి అందిన సమాచారం ప్రకారం ప్రతిపాదన రాలేదన్నారు. అంతేగాక 2014 నుంచి తెలంగాణలో ఎన్‌ఆర్‌సీపీ కింద కొనసాగుతున్న ప్రాజెక్ట్ లేదని.. మూసీ నది కాలుష్య నివారణకు ఎటువంటి ప్రతిపాదన కూడా కేంద్రం పరిశీలనలో లేదని బీఆర్‌ఎస్ ఎంపీలు రంజిత్‌రెడ్డి, వెంకటేశ్ నేత అడిగిన ప్రశ్నలకు షెకావత్ లిఖిత పూర్వక సమాధానంలో తెలిపారు. కాగా తెలంగాణలో, మూసీ నది పరిరక్షణ కోసం ఎన్‌ఆర్‌సీపీ కింద రూ.335.65 కోట్ల వ్యయంతో కాలుష్య నివారణ పనులు మంజూరు చేసినట్లు షెకావత్ తెలిపారు. కాగా 2020లో హైదరాబాద్‌లో మూసీ నది పరిరక్షణకు సంబంధించిన 4 ఎస్‌టీపీ ప్రాజెక్టుల ప్రతిపాదనలను జలశక్తి మంత్రిత్వ శాఖ పరిశీలనలతో రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపించగా, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సవరించిన ప్రతిపాదనను ఇప్పటివరకు కేంద్రానికి సమర్పించలేదని షెకావత్ వెల్లడించారు.

రహదారులకు రూ. 37 వేల కోట్లు...

తెలంగాణలో 1,958 కిలోమీటర్ల పొడవున్న 71 రహదారుల నిర్మాణ ప్రాజెక్టులకు గత మూడేళ్లలో రూ.37,069 కోట్లు మంజూరు చేశామని.. అందులో గత నెల 30వ తేదీ వరకు రూ.2,580 కోట్లు సివిల్ పనులకు ఖర్చు చేసినట్లు కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి బదులిచ్చారు.

కోర్టుకు గైర్హాజరైనా చర్యలు వద్దు: హైకోర్టు

భారీ వర్షాలతో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: న్యాయవాదులు, కక్షిదారులు శుక్రవారం కోర్టుకు హాజరుకాకపోయినా ఎలాంటి ప్రతికూల ఆదేశాలు, వారెంట్లు జారీ చేయవద్దని కింది కోర్టులకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు గురువారం రిజిస్ట్రార్ జనరల్ కె.సుజన ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యాసంస్థలకు సెలవులు..

పరీక్షలు వాయిదా

ఎడతెరిపిలేని వానలతో ప్రభుత్వం అప్రమత్తం

- గురు, శుక్రవారాలు బంద్.. వానలు తగ్గకపోతే మరో రోజూ సెలవు
- గురువారం పిల్లలు స్కూళ్లకు చేరాక సెలవు ప్రకటనతో ఇబ్బంది
- యూనివర్సిటీ పరిధిలో అన్ని పరీక్షలు రద్దు
- వానలతో పలుచోట్ల విద్యుత్, ఇంటర్నెట్‌కు అంతరాయం
- ఇంజనీరింగ్ సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు పెంచాలని విద్యార్థుల విజ్ఞప్తి
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు కూడా శుక్ర, శనివారాలు సెలవు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపిలేని వానలు పడుతుండటంతో ప్రభుత్వం గురు, శుక్రవారాలు రెండు రోజులపాటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. వానలు తగ్గకపోతే శనివారం కూడా సెలవు ఇవ్వాలని క్షేత్రస్థాయిలో అధికారులకు మౌఖిక ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రకటించిన పలు పరీక్షలను రద్దు చేశారు. అన్ని యూనివర్సిటీల పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఇంజనీరింగ్ కాలేజీల్లో జరిగే ఇంటర్నల్ పరీక్షలను రద్దు చేశారు. వీటిని తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ తర్వాత ప్రకటిస్తామని అధికారులు చెప్పారు. ఇక ఇంజనీరింగ్ సహా వివిధ రకాల కౌన్సెలింగ్‌ల తేదీలను మార్చాలని విద్యార్థులు కోరుతున్నారు.

అకస్మాత్తుగా సెలవు నిర్ణయంతో..

రెండు రోజులుగా వానలు పడుతుండటంతో విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వాలన్న విజ్ఞప్తులు వచ్చాయి. కానీ దీనిపై బుధవారం రాత్రి వరకు కూడా అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రెండు రోజుల పాటు సెలవులు ఇస్తున్నట్టుగా గురువారం ఉదయం ప్రకటించారు. ఇది కూడా జిల్లా అధికారులకు మెసేజీల ద్వారా తెలిపారు. మీడియాకు సమాచారం ఇవ్వలేదు. దీనితో సెలవుల విషయం తెలిసేసరికే విద్యార్థులంతా వానలో ఇబ్బందిపడుతూనే స్కూళ్లకు చేరారు. కొన్నిచోట్ల అప్పటికప్పుడే విద్యార్థులను తిప్పి పంపేయగా.. మరికొన్ని విద్యా సంస్థలు ఒంటి గంట వరకు ఇళ్లకు పంపించాయి. ఆటోల్లో, సైకిళ్లపై, నడుచుకుంటూ బడులకు వచ్చే విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. సెలవు విషయం తెలియడంతో తల్లిదండ్రులు హడావుడిగా స్కూళ్ల వద్దకు వచ్చి పిల్లలను తీసుకెళ్లాల్సి వచ్చింది.

ఇంటర్నెట్ ఇబ్బందితో..

ఎంసెట్ తొలివిడత కౌన్సెలింగ్‌లో భాగంగా ఇటీవలే మొదటి విడత సీట్ల కేటాయింపు జరిగింది. ఈ నెల 22 నాటికల్లా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంది. రెండు రోజులుగా వానలతో పలుచోట్ల విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్‌కు అంతరాయం ఏర్పడింది. దీనితో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి ఇబ్బంది పడుతున్నామని, సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు పొడిగించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఉన్నత విద్యా మండలి అధికారి ఒకరు తెలిపారు. ఇక గురువారం జరగాల్సిన టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు సాంకేతిక విద్యా మండలి ప్రకటించింది.

హాస్టళ్ల నుంచి ఇళ్లకు..

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులు ఇళ్లకు వెళ్లేందుకు అనుమతిస్తున్నారు. చాలాచోట్ల హాస్టళ్ల చుట్టూ నీరు చేరడం, పలుచోట్ల పైకప్పుల నుంచి నీరు కారడంతో ఇబ్బందిగా మారిందని సిబ్బంది వాపోతున్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో శుక్ర, శనివారాలు సెలవు

ఎడతెరిపిలేని వానల నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అన్నిరకాల విద్యాసంస్థలతోపాటు ప్రభుత్వ కార్యాలయాలకు కూడా శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు ప్రభుత్వం సెలవులను ప్రకటించింది. వైద్యం, పాల సరఫరా వంటి అత్యవసర సేవలు కొనసాగుతాయని తెలిపింది. ప్రైవేటు సంస్థలు కూడా వారి కార్యాలయాలకు సెలవులు ప్రకటించేలా చర్యలు చేపట్టాలని కార్మికశాఖను ఆదేశించింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి జీహెచ్ఎంసీ పరిధిలో విద్యాసంస్థలు, ప్రభుత్వ/ప్రైవేటు కార్యాలయాలకు రెండు రోజుల సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రపంచంతో పోటీ

- మా పిల్లలను వెస్టర్న్ వరల్డ్ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం
- ఫ్యూచర్ టెక్నాలజీ స్కిల్స్‌పై హైపవర్ వర్కింగ్ గ్రూపుతో భేటీలో ఏపీ సీఎం జగన్



సాక్షి, అమరావతి : పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థులకు ఫ్యూచర్ టెక్నాలజీపై నైపుణ్యాభివృద్ధిని అందించాల్సి ఉందని, ఆ మేరకు పాఠ్యాంశాలు, పాఠ్య ప్రణాళికకు రూపకల్పన చేయాలని ఏపీ సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా బోధనలో, శిక్షణలో ఫ్యూచర్ టెక్నాలజీ వినియోగంపై కార్యాచరణ రూపొందించాలన్నారు. ఫ్యూచర్ టెక్నాలజీ స్కిల్స్‌పై గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో హైపవర్ వర్కింగ్ గ్రూపుతో సమావేశం అయ్యారు. విద్యా శాఖ, మైక్రోసాఫ్ట్, గూగుల్, ఇంటెల్, నాస్కామ్, అమెజాన్ వెబ్ సర్వీసెస్, డేటావివ్ వంటి ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులతో చర్చించారు. ఐబీ (ఇంటర్‌నేషనల్ బాకలారియేట్)తో కలిసి ఒక కొత్త సిలబస్‌ను రూపొందించబోతున్నామని, అది దేశానికే బెంచ్ మార్క్ కాబోతుందని సీఎం జగన్ తెలిపారు. ఐబీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్‌తో కలిసి టీచింగ్ మెథడాలజీని, పాఠ్య ప్రణాళికను మార్చబోతున్నామని.. దీనికి మీ సహకారం అవసరమని కోరారు. తద్వారా ఈ కల సాకారమయ్యే దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. 'వెస్టర్న్ వరల్డ్‌లో ఉన్న బోధనా స్థాయిలను అలవర్చుకుంటేనే మన పిల్లలు కూడా ఆ స్థాయికి చేరి పోటీ పడగలుగుతారు. దీని కోసం ప్రశ్నా విధానం, పిల్లలకు బోధించే విధానంలో కూడా మార్పు రావాలి. కరిక్యులమ్‌లో కూడా మనం వాళ్లకంటే ఏ మేరకు మెరుగు పరుచుకోవాలన్న విషయాన్ని పరిశీలించాలి. ఇందుకు పాఠశాల స్థాయిలో కూడా బోధన, బోధనా విధానా ల్లో ఎలాంటి మార్పులు తీసుకురావాలన్నది ఆలోచించాలి. స్టేట్ సిలబస్, నేషనల్ సిలబస్, సీబీఎస్‌ఈ వంటి అంశాలకే పరిమితం కాకుండా ఇంకా ముందుకు అడుగులు వేయాలి. ఉన్నత విద్యలో పరీక్షా విధానం, మెథడాలజీ, బోధనా పద్ధతులు, పాఠ్య ప్రణాళికలో తీసుకురావాల్సిన మార్పులపై దృష్టి సారించాలి. వెస్టర్న్ వరల్డ్ తరహాలో మరిన్ని వర్టికల్స్‌ను అందుబాటులోకి తీసుకురావడంపై అధ్యయనం చేయాలి. వర్చువల్ టీచింగ్, వర్చువల్ కంటెంట్ అందుబాటులోకి తేవాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో వస్తున్న మార్పులను కరిక్యులమ్‌లో భాగం చేయా లి. ఇంజనీరింగ్, మెడిసిన్‌లో ఎలా భాగస్వామ్యం చేయాలన్న దానిపై అధ్యయనం చేయాలి. సులభంగా అర్థమయ్యేలా ఆచరణీయంగా ఉండేలా మార్పు చేయాలి' అని సీఎం వైఎస్ జగన్ నిర్దేశించారు.

ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్

- విప్లవ సాహిత్యంతోపాటు రూ.3.40లక్షల నగదు స్వాధీనం

కొత్తగూడెం టౌన్: నిషేధిత సీపీఐ మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడితో పాటు మరో దళ సభ్యుడిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు కొత్తగూడెంలో గురువారం ఎస్పీ డాక్టర్ వినీత్ వివరాలు వెల్లడించారు. జిల్లాలోని చర్ల బస్టాండ్ సెంటర్‌లో గురువారం ఉదయం పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు తనిఖీలు చేపట్టి ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరిద్దరూ అశ్వాపురం మండలం చింతిర్యాలకు చెందిన తోట సీతారామయ్య, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్లకు చెందిన పాదం రాజ్‌కుమార్‌గా తేలింది. తోట సీతారామయ్య అలియాస్ కృష్ణన్న అలియాస్ సంజీవ్ మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, రాజ్‌కుమార్ అలియాస్ అమరేందర్ దళ సభ్యుడిగా పనిచేస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నారు. వీరి నుంచి విప్లవ సాహిత్యం, రివాల్వర్, 6 రౌండ్లు(తూటాలు), రూ.3,40,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. రహస్యంగా పార్టీ కార్యకలాపాలను విస్తరించేందుకు హైదరాబాద్ వెళ్తున్న సీతారామయ్యను ప్రొటెక్షన్ టీం సభ్యుడైన నరేష్(ఏసీఎం) మోటార్ సైకిల్‌పై చర్లకు తీసుకొచ్చి, మావోయిస్టు దళ సభ్యుడు పాదం రాజ్‌కుమార్‌ను పరిచయం చేసి వెళ్లాడు. ఆ తర్వాత వీరిద్దరూ చర్ల బస్టాండ్ సెంటర్‌లో ఉండగా పట్టుబడ్డారు. వీరిపై ఉపా చట్టం ప్రకారం కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. పోలీసులపై దాడులు, తదితర ఘటనల్లో పాల్గొన్న సీతారామయ్యపై రూ.20 లక్షలు, రాజ్‌కుమార్‌పై రూ.లక్ష రివార్డు ఉందని ఆయన వెల్లడించారు.

మరోసారి వాయిదా కోరొద్దు..

ఓటుకు కోట్లు కేసులో రేవంత్ న్యాయవాదికి సుప్రీం స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు కోట్లు కేసు విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. విచారణపై మరోసారి వాయిదా కోరవద్దంటూ రేవంత్‌రెడ్డి తరఫు న్యాయవాదిని ఉద్దేశించి పేర్కొంది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ రేవంత్‌రెడ్డి, సండ్ర వెంకట వీరయ్యలు దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ బేలా ఎం త్రివేదీలతో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. సీనియర్ న్యాయవాది అందుబాటులో లేని కారణంగా విచారణ వాయిదా వేయాలని రేవంత్ తరఫు న్యాయవాది కోరారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది హరీన్ రావెల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. హైకోర్టులో రివిజన్ పిటిషన్ పరిస్థితి ఏంటని జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నించగా... గత ఆగస్టు నుంచి పిటిషన్ విచారణకు రాకుండా వాయిదాలు కోరి జాప్యం చేస్తున్నారని హరీన్‌రావెల్ చెప్పారు. విచారణ వాయిదా ఎందుకని ధర్మాసనం ప్రశ్నించగా ఓటుకు కోట్లు కేసుకు అవినీతి నిరోధక చట్టం వర్తించదని రేవంత్ న్యాయవాది తెలిపారు. చట్టం ఎందుకు వర్తించదని జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నించగా.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేశారని అభియోగం మోపారని, ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం సివిల్ కోర్టులు దీనిపై నిర్ణయం తీసుకోలేవని రేవంత్ తరఫు న్యాయవాది తెలిపారు. ఈ విషయం తేల్చాల్సింది ట్రయల్ కోర్టు అని, తాము కాదని జస్టిస్ సంజీవ్‌ఖన్నా వ్యాఖ్యానించారు. తదుపరి విచారణ ఆగస్టు 28తో ప్రారంభయ్యే వారానికి వాయిదా వేస్తున్నామని ధర్మాసనం స్పష్టం చేసింది.



న్యాయవాదుల మనోభావాలు దెబ్బతినేలా వారిపై అనుచితవ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అభినంద్ కుమార్ షావిలిని కలసి వినతిపత్రం సమర్పించారు.
– యాకుత్‌పురా

వర్ధన్నపేట్ నుంచి పోటీకి రిటైర్డ్ సీపీ కసరత్తు?

ఖలీల్‌వాడి: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట్ శాసన సభ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి నిజామాబాద్ రిటైర్డ్ సీపీ కేఆర్ నాగరాజు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఆయన తొలుత బీఆర్‌ఎస్ టికెట్‌పై ఉమ్మడి వరంగల్ నుంచి పోటీ చేస్తారని జిల్లాలో ప్రచారం జరిగింది. మంత్రి ప్రశాంత్‌రెడ్డి ద్వారా ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి ఆయన ప్రయత్నాలు చేస్తున్నారని రాజకీయ వర్గాలు చర్చించుకున్నాయి. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో కారులో సీట్లు ఫుల్ కావడంతో ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి బీఆర్‌ఎస్ అధిష్టానం నుంచి ఆయనకు స్పష్టత రాలేదని తెలిసింది. దీంతో రిటైర్డ్ సీపీ ఇతర పార్టీల వైపు చూస్తున్నారని సమాచారం. ఈనెల 30న మహబూబ్‌నగర్ జిల్లాలోని కొల్లాపూర్ సభలో ప్రియాంక గాంధీ సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

జిల్లా వార్తలు

ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలాలి

బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాచలం వద్ద గోదావరికి వరద పెరుగుతుండడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యాన పరీవాహక మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో సూచించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు అధికారుల సూచన మేరకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తెలిపారు. ఏ ఒక్కరూ వరదలతో నష్టపోకుండా సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు ఫోన్ చేయాలని సూచించారు.

మణిపూర్ దుర్మార్గానికి మోదీ, షాదే బాధ్యత

ఖమ్మంమయూరిసెంటర్/ఇల్లెందు: మణిపూర్‌లో కుకీ గిరిజన మహిళలపై సాముహిక అత్యాచారం జరిపి కిరాతకంగా హత్య చేసిన ఘటనకు ప్రధానమంత్రి మోదీ, హోంమంత్రి అమిత్‌షా బాధ్యత వహించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ వి.సంధ్య డిమాండ్ చేశారు. బీజేపీ పథకం ప్రకారమే వంద రోజులుగా మణిపూర్‌లో అల్లర్లకు దిగగా.. కిరాతకంగా హత్య చేయిస్తోందని ఆరోపించారు. ఇది బీజేపీ ఫాసిస్ట్ అజెండాలో భాగమేనని వారు తెలిపారు. ఈమేరకు మణిపూర్ ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని, కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షాపై విచారణ జరిపించాలని రంగారావు, సంధ్య వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.

పంటల సాగులో జాగ్రత్తలు తప్పనిసరి

సూపర్‌బజార్(కొత్తగూడెం): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యాన రైతులు పంటల సాగులో తగిన జాగ్రత్తలు వహించాలని కొత్తగూడెంలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. వర్షాధార పంటలైన పత్తి, కంది, మొక్కజొన్న, జొన్న, వేరుశెనగ, పెసర, మినుము సాగు చేస్తున్న రైతులు పొలాల్లో నీరు అధికంగా నిల్వ ఉండకుండా బయటకు పంపించాలని తెలిపారు. ఒకవేళ నీరు, తేమ ఎక్కువగా ఉంటే ఎరువులు వేయడం వాయిదా వేసుకోవాలని సూచించారు. లేనట్లయితే ఎరువుల ధాటికి మొక్కల వేర్లు కుళ్లిపోవడంతో పాటు చనిపోయే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే, వరి, మిరప నారుమడుల్లో కూడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు ఓ ప్రకటనలో తెలిపారు.

ఎన్‌క్వాస్.. ఎంతెంత దూరం?!

- భద్రాచలం ఆస్పత్రిని ఇటీవల పరిశీలించిన కేంద్ర బృందం
- అవార్డుకు ఎంపికైతే రూ.20 లక్షల రివార్డు
- గతంలో రాష్ట్ర, కేంద్ర అవార్డులకు ఎంపిక



భద్రాచలం ఏరియా ఆస్పత్రి

భద్రాచలంఅర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని ఏరియా ఆస్పత్రికి ఎన్‌క్వాస్ గుర్తింపుపై ఉత్కంఠ నెలకొంది. జాతీయ నాణ్యతా ప్రమాణాల హామీ సంస్థ(ఎన్‌క్వాస్) గుర్తింపు కోసం ఆస్పత్రి పోటీ పడుతుండగా, ఈనెల మొదటి వారంలో కేంద్రం బృందం పరిశీలించింది. ఈ ఏడాది ఏప్రిల్ 21, 22న ముస్కాన్, లక్ష్య బృందాలు ఆస్పత్రిని సందర్శించగా ఇందులో ముస్కాన్ అవార్డు ప్రకటించారు. ఈ అవార్డు ద్వారా మూడేళ్ల పాటు రూ.24 లక్షల చొప్పున నిధులు అందనున్నాయి. అయితే, లక్ష్య అవార్డుకు సంబంధించి రెండు విభాగాల్లో పోటీ పడగా కేవలం లేబర్ రూంకు మాత్రం అవార్డుకు ఎంపిక కావడంతో ఏటా రూ.2 లక్షల చొప్పున మూడేళ్లకు రూ.6 లక్షల నగదు పురస్కారం అందనుంది. ఇంతలోనే ఎన్‌క్వాస్ బృందం కూడా సందర్శించిన నేపథ్యాన అవార్డు ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

మూడేళ్లకోసారి పరిశీలన

ఎన్‌క్వాస్ బృందం మూడేళ్లకోసారి ఆస్పత్రిని పరిశీలించి అవార్డు ప్రకటిస్తుంది. తొలిసారి 2018లో భద్రాచలం ఏరియా ఆస్పత్రిని సందర్శించి గుర్తింపు ఇచ్చారు. ఆ తర్వాత 2021లో కరోనా ఉధృతి కారణంగా తనిఖీలు జరగలేదు. మళ్లీ ఈ నెల మొదటి వారంలో వచ్చిన బృందం అన్ని విభాగాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేసింది. ఈసారి ఎన్‌క్వాస్ అవార్డుకు ఎంపికైతే 200 పడకలు కలిగిన ఆస్పత్రి ప్రతి పడకకు రూ.10 వేల చొప్పున మూడేళ్లపాటు రూ.20 లక్షల నిధులు అందుతాయి.




ఆస్పత్రిలో పరిశీలిస్తున్న ఎన్‌క్వాస్ బృందం (ఫైల్)

గతంలో ఐదు సార్లు 'కాయకల్ప'

భద్రాచలం ఏరియా ఆస్పత్రి నిర్వహణ, సేవల్లో గతంలో ఐదు సార్లు కాయకల్ప అవార్డు లభించింది. 2016–17 మొదటి బహుమతి (రూ.20 లక్షలు), 2017–18లో ద్వితీయ బహుమతి (రూ.15 లక్షలు), 2018–19లో మొదటి బహుమతి (రూ.20 లక్షలు), 2019–20లో ప్రోత్సాహక బహుమతి(రూ.లక్ష), 2020–21లో మొదటి బహుమతి (రూ. 20 లక్షలు)కి ఎంపికైంది. తద్వారా అందే నిధులతో ఆస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పుడు ఎన్‌క్వాస్ అవార్డుకు కూడా ఎంపికైతే మూడేళ్ల పాటు రూ.24లక్షల చొప్పున అందే నిధులతో పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేలా వసతులు, పరికరాలు సమకూరనున్నాయి.

మరింత అభివృద్ధి చేసుకోవచ్చు



స్వచ్ఛత, వైద్య సేవల్లో ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. జాతీయ స్థాయిలో మరోసారి ఎన్‌క్వాస్ గుర్తింపు వస్తే ఆస్పత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేసుకునేందుకు నిధులు అందుతాయి. తద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించవచ్చు. కేంద్ర బృందం ఆస్పత్రిలో పర్యటించిన సందర్భంగా సంతృప్తి చెందిందనే నమ్మకం ఉంది.
– డాక్టర్ రామకృష్ణ, ఆస్పత్రి సూపరింటెండెంట్

'సాగు–బాగు'పై కేంద్ర బృందం ఆరా



రైతులతో మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ అధికారులు

కూసుమంచి: కూసుమంచి వ్యవసాయ డివిజన్ పరిధిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల సహకారంతో డిజిటల్ గ్రీన్ సంస్థ ఆధ్వర్యాన రైతుల అభ్యున్నతి కోసం గత ఏడాది నుంచి సాగు–బాగు ప్రాజెక్టును అమలుచేస్తున్నారు. ఈ ప్రాజెక్టు నేషనల్ ఈ–గవర్నెన్స్ అవార్డుకు ఎంపిక కాగా కేంద్ర అధికారుల బృందం గురువారం పరిశీలించింది. ఈసందర్భంగా కూసుమంచిలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఐఏఎస్ అధికారులైన విజయ్‌కుమార్, అవినాష్‌చంద్ర శర్మ తదితరులు పాల్గొని ప్రాజెక్టు అమలుతో రైతులకు కలిగిన లాభాలను తెలుసుకున్నారు. నాణ్యమైన మిర్చి ఎలా పండించగలిగారు, ఎలాంటి సలహాలు అందాయి, ఎంత ధర లభించిందో తెలుసుకున్నారు. అనంతరం డిజిటల్ గ్రీన్ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలను వెల్లడించచారు. జిల్లా వ్యవసాయ, ఉద్యానవన అధికారులు విజయనిర్మల, అనసూయ, ఏడీఏ విజయచంద్ర, అధికారులు బాషా, సరిత, వాణి, డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధులు యశోద, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ నుంచి భద్రాచలానికి పాదయాత్ర

నేలకొండపల్లి: మహారాష్ట్రలోని షిర్డీ నుంచి భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయం వరకు పలువురు భక్తులు పాదయాత్రగా వస్తున్నారు. పది మందితో కూడిన ఈ బృందం గురువారం నేలకొండపల్లి మండలానికి చేరుకోగా పలు గ్రామాల్లో స్థానికులు స్వాగతం పలికి ఆర్థిక సాయం అందజేశారు. తాము కోరిన కోర్కెలు నెరవేరడంతో పాదయాత్రగా రామయ్య దర్శనానికి వెళ్తున్నట్లు వారు తెలిపారు.



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

భద్రాద్రి ఆలయ ఆధీనంలోకి 'శ్రీరామ నిలయం'

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీరామ నిలయం మళ్లీ శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధీనంలోకి వచ్చింది. ఈమేరకు గురువారం సాయంత్రం ఆలయ ఈఓ రమాదేవి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రిలో కరకట్టకు దిగువన భక్తుల వసతి కోసం 64 గదులతో నిర్మించిన శ్రీరామనిలయం నిర్వహణ గతంలో దేవస్థానం ఆధ్వర్యంలోనే కొనసాగేది. అయితే, ఈఓగా పనిచేసిన శివాజీ హయాంలో దీనిని ప్రైవేట్ వ్యక్తులకు కేవలం రూ.95 వేల అద్దెకే కట్టబెట్టారు. ఈ విషయమై భక్తుల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తగా, సాక్షిలోనూ కథనాలు ప్రచురితమయ్యారు. అలాగే, వసతి గృహం నిర్వహణలో లోపాలు, సిబ్బందికి నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించడంలేదని దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు అందాయి. ఈమేరకు విచారణ అనంతరం స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు రావడంతో ఈఓ రమాదేవి స్వాధీనం చేసుకున్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఈఓ రమాదేవి, ఉద్యోగులు

ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బందికి పీఎఫ్‌తో కూడిన వేతనం చెల్లించటం లేదని, వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచకుండా పూర్తిగా వ్యాపార ధోరణిలో నిర్వహిస్తున్నట్లు తమ విచారణలో తేలిందని వెల్లడించారు. త్వరలోనే మరమత్తులు చేయించి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవానీరామకృష్ణ, ఈఈ రవీందర్, సీసీ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రి కలెక్టర్‌ను కలిసిన సింగరేణి డైరెక్టర్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రియాంక అలాను సింగరేణి డైరెక్టర్ బి.సత్యనారాయణరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేశాక సంస్థ కార్యకలాపాలను వివరించారు. జీఎం బి.హన్మంతరావు, అధికారులు జి.సూర్యకుమార్, అచ్యుతరావు, కె.అజయ్ కుమార్ పాల్గొన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం)/ఇల్లెందు: కలెక్టర్ ప్రియాంకను సింగరేణి కొత్తగూడెం, ఇల్లెందు ఏరియాల జీఎంలు ఎం.షాలెంరాజు, జాన్ ఆనంద్ గురువారం కలిశారు. కాగా, ఇల్లెందు జీఎం జాన్ ఆనంద్ డీఎఫ్ఓ కిష్టాగౌడ్‌ను కూడా కలిసి అటవీ అనుమతులపై చర్చించారు. అధికారులు తావుర్యానాయక్, శ్రీనివాస్, మల్లయ్య, మహేష్, శివకుమార్ పాల్గొన్నారు.

మరణశాసనంగా మారిన సీపీఎస్

టీఎస్‌సీపీఎస్ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

ఇల్లెందు: రాష్ట్రంలోని 1.72 లక్షల మంది ఉద్యోగుల పాలిట మరణశాసనంగా మారిన సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానం(ఓపీఎస్)ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో చేపట్టిన సంకల్ప యాత్ర గురువారం ఇల్లెందుకు చేరింది. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ ఈ నెల 16న మొదలైన యాత్ర 33 జిల్లాల మీదుగా వచ్చే 12న హైదరాబాద్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఉద్యోగుల స్నేహపూర్వక ప్రభుత్వంగా ప్రకటించుకున్నందున పాలకులు ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు టి. శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీకాంత్, నరేష్‌గౌడ్, రాజశేఖర్, నాగునాయక్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద యూనియన్ నాయకులు

రైల్వేలైన్ కోసం భూమి అప్పగింత

మధిర: మూడో రైల్వే లైన్ ఏర్పాటు కోసం మధిరలో రెవెన్యూ, భూయజమానుల నుంచి సేకరించిన భూమిని గురువారం రైల్వే శాఖకు అప్పగించారు. మూడో లైన్ నిర్మాణానికి అవసరమైన ప్రాంతాల్లో భూయజమానుల నుంచి భూమిని రైల్వే శాఖ కొనుగోలు చేసింది. ఇందులో పలువురు పరిహారం కూడా తీసుకోగా, ఇంకొందరు కోర్టును ఆశ్రయించారు. ఈమేరకు 12, 15, 134, 146, 147, 150 సర్వే నంబర్లలోని భూమిని గురువారం కొలతలు వేసిన రెవెన్యూ అధికారులు రైల్వే శాఖకు అప్పగించారు. సర్వేలో రైల్వే ఏఈఈ వెంకటేశ్వరరావు, జేఈఈలు గోపాలకృష్ణ, పవన్, మధిర సర్వేయర్ ఉషారాణి, ఆర్ఐ జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రైల్వేలైన్ వెంట హద్దులు నిర్ధారిస్తున్న అధికారులు